తోలుబొమ్మలు

రాతిరల్లా బొమ్మలాట చూచివచ్చి
తెల్లవార్లూ నిదరలేక అదేపడగ్గా
పడుకొన్నివుంది ఇల్లాలు, ఇంటిలో వంటలక్క తప్పకలేచి పనిచేసుకుంటూవుంది. ఇంటియజమాని అప్పుడే కళ్లు నులుపుకుంటూ గుమ్మంలోకివచ్చి వీధికేసి తొంగిచూస్తూన్నాడు. బళ్ళున తెల్లారిపోయి ఎండబాగా గుడిగోపురంమీద ప్రకాశిస్తూవుంది— రాత్రిబొమ్మలాట ఆడిన వాళ్ళల్లో ఓ ఆడుదివచ్చి "ఒక పాత కోక అమ్మగార్ని అడుక్కోడానికివచ్చాం" అంది. "అమ్మగారింకా లేవలేదు. నిదరోతున్నారు" అన్నాడు యజమాని. "అమ్మగారైతే రాత్రి మా ఆటకు వచ్చారన్నమాటే. ధన్యులం, ధన్యులం. మళ్ళీవస్తాం" అంటూ వెళ్ళిపోయిందది.

ఆ మాటలో ఏమీఅర్థం కనబడలేదు యజమానికి. లోపలికివెళ్ళి కల్యకృత్యాలు దీర్చుకొని తనగదిలోనికివచ్చి తన యిల్లాలింకా మొద్దునిద్దర్నుంటే "లే! లే! తోలుబొమ్మలాటకే యిలా నిదరోతే, ఇంకానృత్యం అదీ నీవు దొరసానులల్లే చేయడమంటూవస్తే ఆలసిసొలసి కుంభకర్ణురాలివయి పొయ్యేటట్టున్నావు. లే! లే!" అని వీపుమీద ఒక్క మెత్తనిచఱపు చఱిచాడు. ఇల్లాలు గుబుక్కునలేచి 'ఏమిటా మోటుహాస్యం!' అంది. 'ఏమీలేదు. నీవు బొమ్మలాటదానికి కోకిస్తానన్నావటగా? వచ్చిపోయింది' అన్నాడు యజమాని. 'నేను కోకిస్తాననలే. మీరు పంచిస్తానన్నారేమోగాని' అంది ఆవిడ. 'ఏమి మతిపోయిందాయేమి? అదిగో మళ్ళీవస్తానంటూ

పోయింది ' అన్నాడు యజమాని. ' వస్తే యిస్తాలెండి ' అని ఓ విధమైన తెచ్చిపెట్టుకున్న రుసరుసమొగంతో నిదరమత్తు కొద్దీ చేతిగాజులు చెక్కిళ్ళనొత్తిన యొత్తుడునోవులు నోవుల్లా వుంచుకునే గదికిటికీ తెఱచుకొని వీధిలోకి పాఱచూచింది. చూచి ' అదేనా మీరనేమనిషి ? భిక్షురాలు—బొమ్మలాటకత్తె అంటారేమిటి ? ' అంది. ' అమ్మగారైతే రాత్రి ఆటకొచ్చారన్నమాటే. ధన్యులం, ధన్యులం అని అదిఅంది. నీవేమన్నా దాన్ని ఆనవాలు పట్టనట్టుగానే మాట్లాడుతున్నావు — అయితే ఈ తోలుబొమ్మల ఆటలో ఏదో ఒకానొక రహస్యం వుండితీరాలి. తెలుసుకోవాలి ' అన్నాడు ఇంటాయన.

అప్పుడింకా ఆపయిని ఆయనకు ఆబిడకు ఈలా జటిగింది సంభాషణ :

ఇల్లాలు : నేను సాయంకాలం ఆరుగంటలకు ఆలాగు పేరంటానికి వెళ్ళినాను. ఆ యిసుకబయలున నాకేమి అగపించలేదు. ఒక గడపాతి యుండలేదు. ఒకమనిషి కనిపించలేదు.

యజమాని : సరిగా 6కు వాళ్లువచ్చి వెదుళ్లపాతి ఒక బురకాలాగు బరకం కప్పి ఎదరతట్టుకు తెరగుడ్డలు కట్టినారు. ఆ కట్టడం నీవు చూచి యుండలేదు.

ఇల్లా : ఎంతలో తయారయిపోయింది తెర ? అయితే దీపాలెప్పుడు వెలిగించారండీ ? బొమ్మలెప్పుడు గ్రుచ్చారూ ? ఆదేవాళ్లంతా ఆ బరకం క్రిందకు ఎప్పుడు ప్రవేశించినారూ ?

యజ : నీవు ఇంట్లో పనీగినీ ముగించుకుని వచ్చివేసే సరికి బొమ్మలనుగ్రుచ్చి ఆ తెరవెనక బొమ్మలనుగ్రుచ్చి ఆముదపు దీపాలను వ్రేలాడగట్టి అంతా సిద్ధంచేసినారు.

ఇల్లా : ఈ పగలల్లా భిక్షాటనకై తిరిగినవాళ్ళంతా ఆ బరకంచాటున వున్నారంటారూ నేను చూడ్డానికి వచ్చేటప్పటి కప్పుడే ?

యజ : మరేమి టనుకున్నావు ? మనం వాళ్ళను చీకట్లో చూడకుండా వాళ్లు దీపాలు వెలిగించకుండానే ఆ బరకంలో ప్రవేశించి యప్పుడు దీపాలుపెట్టి బొమ్మల్ని ఆడిస్తారు.

ఇల్లా : నిజం ?

యజ : నిజం.

ఇల్లా : అయితే వాళ్ళకు ప్రేక్షకుల ప్రేక్ష్యం లేదన్న మాట.

యజ : వాళ్ళకు ప్రేక్షకులతో పనిలేదు. ఆ ఆడించే బొమ్మలతోనేపని. ఆ బొమ్మల మీదకు వెలుగు బాగా ప్రసరించేటట్టు దీపాలెగసందోస్తూ పాడుతూండడం బొమ్మలయొక్క కాళ్లువ్రేళ్లు అభినయింపిస్తూవుండడం వాళ్లపని.

ఇల్లా : మధ్యమధ్య బుఝ్ఝుమనేబూరా ఏమిటండీ ?

యజ : కిక్కిసికర్రబూరా.

ఇల్లా : హనుమంతుడు గిర్రునపల్టీలు కొట్టినప్పుడు చేసే చప్పుడు ?

యజ : రెండు చితికిపోయిన పీటచెక్కలు.

ఇల్లా : ఆఁ ! విఘ్నేశ్వరునిబొమ్మ ?

యజ : తోలుది.

ఇల్లా : సరస్వతి ?

యజ : అదీని.

ఇల్లా : రాముడు ? రావణుడు ?

యజ : అన్నీని. అందుకే తోలుబొమ్మలాటని పిలవడం.

ఇల్లా : అయితే ఆ ఆడించేవాళ్లంతా వీధులంట తిరిగే వాళ్లే అంటారా ? ' ఓయి రావణా ' అని పిలవడం, ' పుత్ర= కొడుకులు, మిత్ర=స్నేహితులు, రథ=రథములు, భట= భటులు, బంధువర్గము ' అని అర్థంచెప్పడం, ' బ్రహ్మాత్మభూ స్సురజ్యేష్ఠ పరమేష్ఠిపితామహః ఇత్యమరః ' అని అనడం, చౌషష్టివిద్యలు ఏకరు పెట్టడం, ఇంతవిద్వత్తూవాళ్లదే నంటారా ?

యజ : అంతే అనుకున్నావూ ? పంపాసరోవరము, రథారూఢుండెక్కె, అనువుతుండు ఇలాంటివి కూడా వాళ్ళవేను.

ఇల్లా : నవ్వకండీ ! తెలియక అడుగుతూవున్నాను. నా చెవుల్లోనుంచి యింకాపోలేదు ఆ దీర్ఘం తీసుకుంటూ వాళ్ళంతా కలిసి ఆతన్మయత్వంలో తాళం మద్దెల షూడోకాలంమీద వేస్తూ మైమఱచి—

యజ : మైమఱచి ?

ఇల్లా : మైమఱచి మనలను మఱపించినపుడు. మానవు డొకానొక తోలుబొమ్మ వెనుక దీపంవుంచి ఆ వెలుతురును దాని మీద పడేటట్టుచేస్తూ ఆ బొమ్మను చిన్నెలువన్నెలుగా ఆడిస్తూ ఆనందించేటప్పుడు, భగవంతుడు ఏవైపునా మనకుపైని, వెనుక, ముందు, సూర్యుడుమున్నగు జ్యోతిర్గోళాలను నిలిపి మనల నాడించడంలో ఎంతతన్మయుడై యుండాలంటారు ? ఆ భగ వంతుణ్ణి మనం ఆనవాలు పట్టలేమనడంలో, మన కగ్గనబడ దనడంలో, ఆశ్చర్యములేదు —వీళ్ళగపించినారా మనకు ? చెప్పండి, వీళ్ళగపించినారా మనకు ? చెప్పండి—అదిల్లా తిరిగి వస్తూంది. మంచి కోకఒకటిద్దాం.

యజ : నీ యిష్టంవచ్చిందియ్యి.

ఇల్లాలు లోపలికివెళ్ళి ఒక కోకతీసికొని వచ్చి ఆబొమ్మ లాటదాని కిచ్చి 'రాత్రిఆడించిన బొమ్మలేమైనా నీ దగ్గ ఉన్నాయా? యిప్పుడు' అని అడిగింది. 'ఏమైనా ఏంటం డమ్మగారూ! పెద్దరావణాసురుని బొమ్మేవుంది. ఇప్పుడేతెచ్చి చూపుతాను.' అని వెళ్ళినది. అది ఆ బొమ్మ తీసుకొనివచ్చే లోపుగా వంటలక్కవచ్చి 'అమ్మగారింకా ముఖం కడుక్కో లే'దంది. ఇల్లాలు 'ఉండవమ్మా! ఈ రోజున తోలుబొమ్మల యొక్క సంగతి పూర్తిగా తెలుసుకోవాలి' అని అంటూ పెఱటి లోనికి పోయి కల్యకృత్యములు దీర్చికొని తిరిగి వచ్చింది.

యజమాని ఆ లోపున ఆ తేబొయ్యేరావణాబమ్మబొమ్మ పగలెలావుంటుందో ఊహిస్తూ కూర్చున్నాడు. ఆ బొమ్మొ చ్చింది. ఇంటిల్లిపాదీ మూగిచూచినారు. నగిషీబొమ్మయొక్క అందచందం, కీలుకీలుఅతుకు అతిచిత్రంగా కనిపించింది. చేతులు మేకతోలు. మొండెం దుప్పితోలు. ఆ బొమ్మనలాగూర్చి తేజ స్సులో పెట్టేసరికి ఎక్కడలేనిరంగుల రాణింపూ! చెప్పశక్యం కాకపోయింది.

ఉండియుండి తోలుబొమ్మలాడించిన దానికేసిచూస్తూ ఇల్లాలు అడిగింది! 'నీవు రాత్రి ఆ బరకంలోవున్నావా?' అని. 'మీరు రాలేదండి మఱి' అంది ఆ ఆటకత్తె.

వాళ్లిద్దఱియొక్క ఆ పరస్పర మహాసమస్యను అక్కడ వున్న యజమానికాదుగదా ఎవ్వరూకూడా తీర్చలేకపోయినారు.

ఆటకత్తె తనదారిని తానుతిరిగి రావణాబొమ్ముచ్చుకుని, ఇచ్చిన కోకుచ్చుకుని వెళ్ళిపోయింది. అది వెళ్లిపోయిన వెంటనే

యజమాని ఇల్లాలుదిక్కై ‘ బ్రహ్మాండంగా రావణాబమ్మ బొమ్మ దాన్ని పనిగట్టుకు పట్టుకురమ్మనమని, పట్టపగలు బొమ్మంతా పరిశీలించి తుదకాబొమ్మను గుఱించి ఒక్కముక్కా అడక్కుండా నీవు రాత్రి ఆ బరకంలో వున్నావా ? అని ఆ ఆటకత్తెను అడిగావేంటి. అదుండక మఱెవరుండి ఆడించేరు ఆ బొమ్మల్ని అంతసొంపుగా ’ అన్నాడు. ఇల్లాలు అంది. ‘ రావణాసురుని బొమ్మలో రాత్రిచూచిందానికన్న ఇప్పుడు పగలు చూడ్డంలో నాకేమి వింత తట్టలేదు. కాని ఈ భిక్షుకురాలు రాత్రి ఆబరకంలో వుండి ఆడించింది బొమ్మల్ని అంటే నాకింకను సందేహమే ’ అని—‘ అందుకే నీవు ఆటచూడ్డానికి రాలేదని అదీ అనుకుంటూంది ’ అన్నాడు యజమాని. ‘ అవును కొన్ని సంగతులు మనం చూడగల్గినా, చూడకపోయినా మనం నమ్మాలి ’ అంది ఇల్లాలు.

“ సంశయాత్మా వినశ్యతి ” అన్నాడు యజమాని.